## జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియామకం

❖ఉత్తర్వులు జారీ చేసిన జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్



**దశ, రామన్నపేట:** తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియమితులయ్యారు.ఈ మేరకు జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ తోగరి కరుణాకర్‌కు ముత్యాల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ముత్యాల రమేష్ పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## చేయూత పింఛన్‌కు ఇదే చివరి ఛాన్స్!

❖ సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛన్ పథకం కింద ప్రాధాన్యతా వర్గాలకు చెందిన అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయనుంది. ఇందులో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులతో పాటు తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులు ఉన్నారు. అర్హత కలిగిన వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 15, 2026 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోరారు.

## సైన్స్ డ్రామా పోటీలో జిల్లా ప్రథమ సాధించిన క్రిష్ణవేణి విద్యార్థులు



**దశ, రామన్నపేట:** జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం లో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ డ్రామా కాంపిటీషన్ పోటీలలో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాయగిరి ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డ్రామా కాంపిటీషన్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పర్యావరణం అసమతుల్యత వల్ల మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు, సముద్రాల కాలుష్యం వల్ల ప్రపంచ దేశాలకు ఎదురవుతున్న నష్టాలపై కనిపిప్పు కలిగించే విధంగా " సేవ్ ఓషియన్ సేవ్ ఫ్యూచర్ జనరేషన్" థీమ్ తో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ డ్రామా పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా స్థాయి లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి ప్రోత్సాహం అందించిన గైడ్ టీచర్ మురళి, సహకారం అందించిన ఉపాధ్యాయులు పునందాస్, అలీం, కల్పన తదితరులను కరెస్పాండెంట్ తో పాటు, ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.మణి, ఇతర సిబ్బంది అభినందించారు.

## పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం!

❖ అడ్డుకునే క్రమంలో ముగ్గురికి గాయాలు





**దశ, వరంగల్:** మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం పోలీస్‌స్టేషన్ వరకు చేరడంతో బాధితుడు కట్ల హర్షిత్ తీవ్ర చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన హర్షిత్ తనపై మండే ద్రవం పోసుకుని నిప్పంటించుకుని లోపలికి పరుగెత్తినట్లు సమాచారం. అతడిని కాపాడేందుకు పోలీసులు చేసిన ప్రయత్నంలో హర్షిత్‌తో పాటు స్టేషన్ రైటర్ ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్ మగ్దూం గాయపడ్డారు. గాయపడిన ముగ్గురినీ చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

---

### CPS ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితం – ఆర్థిక భద్రతపై ప్రశ్నలు

# జీవితాంతం ప్రభుత్వానికి సేవ... పదవీ విరమణ తర్వాత భరోసా ఏది?




ప్రభుత్వ ఉద్యోగి తన జీవితంలో అత్యంత విలువైన సంవత్సరాలను ప్రజాసేవకు అంకితం చేస్తాడు. మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు సేవలు అందించడం, పరిపాలనా వ్యవస్థను ముందుకు నడిపించడం వంటి బాధ్యతలను నిర్వర్తించి చివరకు పదవీ విరమణ పొందుతాడు. ఆ తర్వాత తన శేష జీవితాన్ని ఆర్థిక భద్రతతో, ఆత్మగౌరవంతో గడపాలని ఆశించడం సహజం.

అయితే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS)/నేషనల్ పెన్షన్ సిస్టమ్ (NPS) పరిధిలో ఉద్యోగంలో చేరి ప్రస్తుతం పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఉద్యోగ, పెన్షనర్ వర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది. పాత పెన్షన్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగికి నిబంధనల ప్రకారం నెలవారీ పెన్షన్ లభించేది. CPS/NPS విధానంలో ఉద్యోగి, ప్రభుత్వం చెల్లించిన చందాలు పెట్టుబడిగా మారి, పదవీ విరమణ సమయంలో సమకూరిన కార్పస్ మరియు వర్తించే నిబంధనల ఆధారంగా పదవీ విరమణ ప్రయోజనాలు నిర్ణయించబడతాయి. అందువల్ల పదవీ విరమణ అనంతరం తమకు ఎంత స్థిరమైన ఆదాయం లభిస్తుంది, అది భవిష్యత్తు అవసరాలకు సరిపోతుందా అనే సందేహం పలువురు ఉద్యోగుల్లో ఉంది.

### పదవీ విరమణతో ఆదాయం తగ్గుతుంది... అవసరాలు మాత్రం తగ్గవు

ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రతి నెలా జీతం వస్తుంది. పదవీ విరమణ చేసిన మరుసటి రోజు నుంచి పరిస్థితి మారిపోతుంది. కానీ కుటుంబ అవసరాలు ఒక్కరోజులో ముగిసిపోవు.

ఇంటి నిర్వహణ, విద్యుత్ బిల్లులు, నిత్యావసర వస్తువులు, కుటుంబ బాధ్యతలు, వివాహాలు, ఇతర అనివార్య ఖర్చులు కొనసాగుతూనే ఉంటాయి. వీటికి అదనంగా వయస్సు పెరిగే కొద్దీ వైద్య అవసరాలు పెరిగే అవకాశం ఉంటుంది.

అందుకే పదవీ విరమణ అనంతరం వచ్చే నెలవారీ ఆదాయం కేవలం ఒక ఆర్థిక ప్రయోజనం కాదు. అది వృద్ధాప్యంలో ఒక వ్యక్తి స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన ప్రధాన ఆధారం.

### వైద్య ఖర్చులే పెద్ద సవాలు

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల విషయంలో అత్యంత కీలకమైన అంశాల్లో ఆరోగ్య సంరక్షణ ఒకటి. వయస్సు పెరిగే కొద్దీ వైద్య పరీక్షలు, మందులు, ఆసుపత్రి చికిత్సలు తదితర అవసరాలు పెరగవచ్చు.

ఇలాంటి సమయంలో నెలకు వచ్చే ఆదాయంలో గణనీయమైన భాగం వైద్య అవసరాలకే ఖర్చయ్యే పరిస్థితి ఏర్పడితే కుటుంబ నిర్వహణ భారంగా మారుతుంది. అందువల్ల పెన్షన్ విధానంపై చర్చించేటప్పుడు ఆరోగ్య భద్రతను కూడా అంతర్భాగంగా చూడాలి.

పెన్షనర్లకు అందుబాటులో, సమర్థవంతమైన వైద్య సేవలు ఉండటం ఎంత ముఖ్యమో, వారి చేతిలో గౌరవప్రదమైన నెలవారీ ఆదాయం ఉండటం కూడా అంతే ముఖ్యం.

### ద్రవ్యోల్బణాన్ని విస్మరించలేం

నేడు సరిపోతున్న ఆదాయం పది లేదా పదిహేను సంవత్సరాల తర్వాత కూడా అదే కొనుగోలు శక్తిని కలిగి ఉంటుందని చెప్పలేం. నిత్యావసర వస్తువులు, ఇంటి నిర్వహణ, రవాణా, వైద్యం తదితర ఖర్చులు కాలక్రమేణా పెరుగుతుంటాయి. ఒక ఉద్యోగి 60 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేస్తే మరో 20 నుంచి 30 సంవత్సరాల జీవితకాల అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి రావచ్చు. అందువల్ల పదవీ విరమణ ఆదాయాన్ని నిర్ణయించేటప్పుడు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడం అత్యంత అవసరం.

### జీవిత భాగస్వామి భద్రత కూడా ముఖ్యమే

పెన్షన్ వ్యవస్థను కేవలం ఉద్యోగికి మాత్రమే సంబంధించిన అంశంగా చూడకూడదు. ఉద్యోగి మరణించిన తర్వాత అతని లేదా ఆమె జీవిత భాగస్వామి పరిస్థితి ఏమిటన్నది కూడా సామాజిక భద్రతలో కీలకమైన అంశం.

వృద్ధాప్యంలో జీవిత భాగస్వామి ఒక్కరే మిగిలినప్పుడు కుటుంబ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుంది. అదే సమయంలో వైద్య, జీవన వ్యయాలు కొనసాగుతాయి. అందువల్ల ఉద్యోగితో పాటు కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా జీవిత భాగస్వామికి దీర్ఘకాలిక భద్రత కల్పించే విధానం అవసరం.

### ఉద్యోగుల మధ్య పెన్షన్ వ్యత్యాసం

ఒకే ప్రభుత్వ వ్యవస్థలో సంవత్సరాల పాటు పనిచేసిన ఉద్యోగుల్లో కొందరు పాత పెన్షన్ విధానం పరిధిలో ఉండగా, తరువాత నియమితులైన వారు CPS/NPS పరిధిలో ఉన్నారు.

దీంతో పదవీ విరమణ తర్వాత లభించే ప్రయోజనాల విషయంలో తేడాలు కనిపించడం సహజంగానే ఉద్యోగుల్లో చర్చకు దారితీస్తోంది. ఒకే విధమైన ప్రజాసేవ చేసిన ఉద్యోగుల వృద్ధాప్య భద్రత విషయంలో ఏర్పడుతున్న ఈ వ్యత్యాసంపై ప్రభుత్వం సానుభూతితో కాకుండా సమగ్ర సామాజిక భద్రతా దృక్పథంతో పరిశీలన చేయాలి.

### పెన్షన్ దయ కాదు - సామాజిక భద్రత

పెన్షన్ గురించి చర్చ వచ్చినప్పుడు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందిస్తాడు. పదవీ విరమణ అనంతరం అతనికి లభించే ఆర్థిక భద్రతను కేవలం ప్రభుత్వంపై పడే వ్యయంగా చూడటం సమంజసం కాదు.

వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు అవసరమైన సామాజిక భద్రతగా పెన్షన్‌ను చూడాలి. పదవీ విరమణ తర్వాత తన కనీస అవసరాల కోసం పిల్లలపై లేదా ఇతర కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి ఒక ఉద్యోగికి రాకూడదు. జీవితాంతం స్వతంత్రంగా జీవించిన వ్యక్తికి వృద్ధాప్యంలో కూడా అదే ఆత్మగౌరవాన్ని కాపాడుకునే ఆర్థిక భరోసా ఉండాలి.

### ఇప్పటికే పదవీ విరమణ చేసిన CPS ఉద్యోగులపై అధ్యయనం అవసరం

CPS/NPS గురించి కేవలం భవిష్యత్తులో పదవీ విరమణ చేయబోయే ఉద్యోగుల కోణంలోనే కాకుండా, ఇప్పటికే ఈ విధానం కింద పదవీ విరమణ చేసిన ఉద్యోగుల వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం అధ్యయనం చేయాలి. వారికి నెలకు ఎంత పదవీ విరమణ ఆదాయం అందుతోంది? వారి చివరి జీతంతో పోలిస్తే అది ఎంత? కుటుంబ నిర్వహణకు సరిపోతుందా? వైద్య ఖర్చులను భరించగలుగుతున్నారా? ద్రవ్యోల్బణ ప్రభావం ఎలా ఉంది? జీవిత భాగస్వామికి ఎంత భద్రత ఉంది? ఇలాంటి అంశాలపై వాస్తవ గణాంకాలను సేకరించి, ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, ఆర్థిక నిపుణులు మరియు సంబంధిత వర్గాలతో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాలి.

### కనీస పెన్షన్ భరోసాపై చర్చ జరగాలి

పదవీ విరమణ చేసిన ప్రతి ఉద్యోగికి కనీసం గౌరవప్రదమైన జీవనానికి సరిపడే నెలవారీ ఆదాయం ఉండేలా ప్రభుత్వ విధానం ఉండాలన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. CPS/NPSలో మార్కెట్ ఆధారిత పెట్టుబడి అంశాలు ఉన్నప్పటికీ, ఉద్యోగి వృద్ధాప్య జీవితం పూర్తిగా ఆర్థిక అనిశ్చితికి గురికాకుండా కనీస పెన్షన్ భరోసా, ద్రవ్యోల్బణ రక్షణ, కుటుంబ భద్రత, వైద్య భద్రత వంటి అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

### ఇది కేవలం ఉద్యోగుల సమస్య కాదు

నేటి CPS ఉద్యోగులే రేపటి పెన్షనర్లు. అందువల్ల ఇది ప్రస్తుతం పదవీ విరమణ చేసిన కొంతమంది ఉద్యోగులకు మాత్రమే సంబంధించిన అంశం కాదు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలో ఉన్న లక్షలాది ఉద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన సామాజిక భద్రతా అంశం. ఉద్యోగంలో ఉన్నప్పుడు తన భవిష్యత్తుపై నమ్మకం ఉన్న ఉద్యోగి మరింత ప్రశాంతంగా విధులు నిర్వర్తించగలడు. పదవీ విరమణ తర్వాత తనకు, తన కుటుంబానికి కనీస ఆర్థిక భద్రత ఉంటుందనే విశ్వాసం ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థకు కూడా అవసరం.

### ప్రభుత్వానికి విజ్ఞప్తి

CPS/NPS పరిధిలో ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగుల జీవన పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలతో చర్చించి వారి అనుభవాలు, సమస్యలను నమోదు చేయాలి. పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన స్థిరమైన ఆదాయం, ద్రవ్యోల్బణ రక్షణ, కుటుంబ పెన్షన్ భద్రత, సమర్థవంతమైన వైద్య సదుపాయాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ చేసిన రోజుతో ప్రభుత్వంతో అతనికున్న అనుబంధం ముగిసిపోదు.

> "జీతం ఉద్యోగ కాలానికి భరోసా అయితే – పెన్షన్ వృద్ధాప్య జీవితానికి భరోసా."

> "ఉద్యోగ జీవితానికి పదవీ విరమణ ఉంటుంది... కానీ ఉద్యోగి ఆత్మగౌరవానికి, ఆర్థిక భద్రతకు విరమణ ఉండకూడదు."



— మహమ్మద్ ఉస్మాన్ పాషా
అధ్యక్షులు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం
(TSGREA)
కరీంనగర్ జిల్లా శాఖ

---



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్

**దశ, రామన్నపేట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత కార్డులు (స్మార్ట్ కార్డులు) పంపిణీ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం భోగారం గ్రామపంచాయతీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు, సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ,చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు భోగారం గ్రామ ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, 1వ వార్డు సభ్యురాలు గోగు ప్రమీల రమేష్ యాదవ్, 3వ వార్డు మెంబర్ కనుక మల్లేష్ ముదిరాజ్, 4వ వార్డు మెంబర్ మేడి అంజనేయులు, 5వ వార్డు సభ్యురాలు నేరటి మానస సురేష్ యాదవ్, 6వ వార్డు సభ్యురాలు కడారి పావని పాపయ్య, 7వ వార్డు మెంబర్ గోగు సురేష్ యాదవ్, 9వ వార్డు సభ్యురాలు వనం అండాలు యాదగిరి, గ్రామపంచాయతీ కార్యదర్శి సుధా, గ్రామ పరిపాలన అధికారి జిపిఓ,లక్ష్మీదేవి, భోగారం పాఠశాల హెడ్మాస్టర్ శ్రీలత, భోగారం/సిరిపురం విద్యుత్ లైన్మెన్ కూనూరు మహేష్ గౌడ్, అంగన్వాడీ టీచర్ బత్తుల వసంత, ఫీల్డ్ అసిస్టెంట్ గాదే విమలమ్మ, గ్రామ సంఘం బంధం వివో,భోగ సంధ్యారాణి, భోగారం గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఆర్మీ ఆయుధాల చోరీ.. రిటైర్డ్ హవల్దార్ అరెస్ట్..



**దశ,హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలం సృష్టించిన బొల్లారం 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్లోని కోట, మ్యాగజైన్ నుంచి తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ చేసిన కేసులో రిటైర్డ్ ఆర్మీ హవల్దార్ ఉప్పుతొల్ల మల్లేష్ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లారం పోలీసులు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ మల్కాజ్గిరి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు పదవీ విరమణపై అసంతృప్తితోనే చోరీకి పాల్పడినట్లు సమాచారం. దాదాపు పదహారు ఏళ్ల పాటు మద్రాస్ రెజిమెంట్ లో పనిచేసిన మల్లేష్ ఈ ఏడాది జూన్ మాసంలో ముందస్తు పదవీ విరమణ కావడంతో తీవ్ర ఉద్వేగానికి లోనయ్యాడు.

ఘటనకు వేరే కారణాలున్నాయా అనే కోణంలో కుడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆగస్టు నెల 30/31 రాత్రి మల్లేష్ ఒక ఏకే రైఫిల్, ఒక ఎన్సాస్ రైఫిల్, మూడు పిస్టల్లు, నైట్ విజన్ కళ్లజోడు, బుల్లెట్లు లను బోల్లారం మద్రాస్ రెజిమెంట్ లో అయుధాగారం నుంచి దొంగిలించి పారిపోయాడు. నిందితుడి స్వస్థలం నాగర్ కర్నూలు. దొంగిలించిన అయుధాలను కౌకూరు, యాప్రాల్, నాగర్ కర్నూలు లో దాచిపెట్టాడు. బోల్లారం పోలీసులు, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, మల్కాజిగిరి ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపారు.

# ఏళ్ల నిరీక్షణకు తెర..

- రూ.10 కోట్లతో డ్రైనేజీ పనులకు శ్రీకారం!
- తట్టి అన్నారం నుంచి మర్రిపల్లి వరకు మురుగు కాలువల అభివృద్ధి.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ.

**దశ, పెద్ద అంబర్ పేట:** ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న డ్రైనేజీ, మురుగు కాలువల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. తట్టి అన్నారం, ఆర్కే నగర్ నుంచి మరిపెల్లి వరకు డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులతో శ్రీకారం చుట్టారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ పనులను ప్రారంభించారు. ఏళ్లుగా మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరడం, కాలనీల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరిచేందుకు రూ.10 కోట్లతో పనులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల చిరకాల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పండుగల రాజు, సిద్ధంకి కృష్ణారెడ్డి, , దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, మల్లెపాక మల్లేష్, చంద్రగోని గోవర్ధన్‌గౌడ్, పాశం దామోదర్, గంట లక్ష్మారెడ్డి, చిరంజీవి, ఆర్కే నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాలిగామ మోహన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాటిపాముల శివకుమార్, గడ్డం లక్ష్మణ్, బలెంల దేవయ్యతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పనుల ప్రారంభ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



# ప్రభుత్వ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**దశ, మునగాల:** స్వయంసహాయ సంఘం మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పథకాలను పొదుపు సంఘం మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈధులవాగుతండా గ్రామంలో మండల మహిళా సమైక్యకు మంజూరైన సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన ఆ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు రాయితీలతో కూడిన అనేక పథకాల ద్వారా మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రత్యేక కార్యచరణలతో పనిచేస్తుందని, దీనిలో భాగంగానే మండల పరిధిలోని ఈదులవాగు తండ గ్రామంలో మునగాల మహిళా సమైక్యకు సోలార్ పవర్ ప్లాంట్ మంజూరు చేసిందన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి నాలుగు నుండి 8 ఎకరాల భూమి అవసరం ఉన్నదని ఇట్టి విషయమై స్థానిక రెవెన్యూ అధికారులు ఈదుల వాగు తండ గ్రామంలో ప్రభుత్వ భూమిని సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఇవ్వడానికి ముందుకు రావడంతో, త్వరలో పూర్తిస్థాయి నిర్మాణ అనుమతులు మంజూరు చేసి గ్రామంలో మండలమహిళా సమైక్య ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు అధికారి సురేష్, డిపిఎం అరుణ్ కుమార్, ఏపీఎం కరుణాకర్, నాన్ ఫామ్ ఏపిఎం నగేష్, సిసి సాంబయ్య, మరియు మండలమహిళా సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచండి

- నేరాల నియంత్రణ, ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,
- సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ




**దశ, సారంగాపూర్:** అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని , నేరాల నియంత్రణ విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు పై ఎస్పీ అశోక్ కుమార్ సారంగాపూర్ మండల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు , నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు.

ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల తరచుగా సందర్శిస్తూ పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే రాబోవు గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# టెక్నాలజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి





- ఓయూ పరిపాలన భవనం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం టెక్నాలజీ కాలేజ్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. హాస్టల్ వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. విద్యార్థుల డిమాండ్‌పై అధికారులు స్పందించి హాస్టల్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ ప్రముఖ్ సుమన్ శంకర్, సిటీ సెక్రటరీ పృధ్వితేజ, ఓయూ అధ్యక్షుడు గెల్లు శేఖర్, సెక్రటరీ మోక్షిత్, సిటీ జాయింట్ సెక్రటరీ దినేష్, నితిన్, వివేక్, భానుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో రయ్.. రయ్!

- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు



**దశ, హైదరాబాద్:** మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి ఇద్దరు మహిళలను ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో చోటుచేసుకుంది. వోక్స్‌వ్యాగన్ కారులో యువతీ, యువకుడు అతివేగంగా వెళ్తూ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ఆశా ఆసుపత్రి వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళలను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా, వారిలో రంజనా రాయ్ (32) పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

# ఫేక్ హాల్‌మార్క్‌తో మోసం

- రెండు జ్యువెలరీ షాపులు సీజ్
- అధికారుల ఆకస్మిక తనిఖీలు
- గిరిజనుల ప్రయోజనాలపై దృష్టి



**దశ, భద్రాచలం:** భద్రాచలం ఏజెన్సీలో బంగారు నగల వ్యాపారంపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గిరిజన వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని నకిలీ హాల్‌మార్క్ గుర్తులతో బంగారు ఆభరణాలు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించిన శ్రీదేవి, వెంకటరత్నం జ్యువెలరీ షాపులను అధికారులు సీజ్ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తమ కష్టార్జిత సొమ్మును కూడబెట్టుకుని బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో బంగారం నాణ్యత, స్వచ్ఛతపై పూర్తిస్థాయి అవగాహన లేని వినియోగదారులను మోసం చేసే అవకాశం లేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.సీజ్ చేసిన దుకాణాల్లోని ఆభరణాలు, హాల్‌మార్క్ గుర్తులు, విక్రయ రికార్డులు, బిల్లులు తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం రెండు దుకాణాలకే పరిమితం కాకుండా భద్రాచలం ఏజెన్సీలోని అన్ని బంగారు దుకాణాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నకిలీ హాల్‌మార్క్‌లు, తప్పుడు నాణ్యత గుర్తుల వినియోగం, బిల్లుల జారీ, బంగారం స్వచ్ఛత తదితర అంశాలపై అధికారులు లోతుగా పరిశీలించాలని కోరుతున్నారు. తాజా తనిఖీలతో గిరిజన వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

# సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి



**దశ, హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్‌లో ఏరియా ఆసుపత్రి ఎదురుగా నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని శుక్రవారం స్థానికులు ఆందోళన చేపట్టారు. టవర్ నిర్మాణం వల్ల ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పురపాలక సంఘం కమిషనర్, చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏరియా ఆసుపత్రి,నివాస ప్రాంతానికి సమీపంలో టవర్ నిర్మాణాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే నిర్మాణ పనుల గురించి సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా మాకు అన్ని అనుమతులు ఉన్నాయని, పనులు ఆపేది లేదు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్

**దశ, మునగాల:** తరగతిగదిలో పాఠాలు బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతలుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు అనిఎంపీడీవో రమేష్ దీన్ దయాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 9 మందికి, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 13 మంది ఉపాధ్యాయులకు, ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు లు మెమొంటో, ప్రశంసాపత్రం, శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు.

అదేవిధంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఎంఈఓగా ఎంపికైన స్థానిక ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన గోనఅనురాధ, జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపికైన పాది జయలక్ష్మి ,జిల్లాఉత్తమ ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికైన అన్నపూర్ణ తదితరులను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు, పిఆర్ టి యు మండల అధ్యక్షుడు అడిదల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుల్తాని శంకర్, యుటిఎఫ్ బాధ్యులు ఎండి సత్తార్, టిపిటిఎఫ్ జిల్లా బాధ్యులు చెవుల బిక్షం, ఎస్టియు మండల బాధ్యులు సత్తూరి బిక్షం, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దీపాదేవి, తేజ రామ్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పెండింగ్ భవనాలు పూర్తి చేయాలి
- అశ్వాపురం రైతువేదికలో మండల స్థాయి సమీక్షా సమావేశం
- ప్రత్యేక అధికారిణి చందన, ఎంపీడీఓ ముత్యాలరావు హాజరు
- సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలపై సర్పంచుల వినతులు



**దశ, అశ్వాపురం:** గ్రామాల్లో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని అశ్వాపురం మండల ప్రత్యేక అధికారిణి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. చందన సూచించారు. శుక్రవారం స్థానిక రైతువేదిక భవనంలో ఎంపీడీఓ పి. ముత్యాలరావు ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారిణి చందన అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొని గ్రామాల వారీగా అభివృద్ధి పనుల ప్రగతి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.
అశ్వాపురం ప్రధాన పంచాయతీ పరిధిలో 15 సీసీ రోడ్లు అత్యవసరంగా నిర్మించాలని, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని బాణోత్ చందర్‌లాల్ కోరారు. చింత్రియాల, చింత్రియాల కాలనీలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు. తుర్రంవారిగూడెం, ఎలకలగూడెం, గొందిగూడెం కొత్తూరు, మనుబోతులపాడు, బట్టీలగుంపు గ్రామాల్లో నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.
ఎంపీడీఓ ముత్యాలరావు మాట్లాడుతూ భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రతి ఇంట్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు నిర్మించేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అర్హులైన వారు చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ చివరి గడువు కావడంతో, ఇంకా దరఖాస్తు చేయని వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా సర్పంచులు, కార్యదర్శులు చొరవ చూపాలని తెలిపారు.ప్రతి 45 రోజులకు నిర్వహించే మండల స్థాయి సమీక్షా సమావేశాల ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతుందని చందన తెలిపారు. సర్పంచులు ప్రస్తావించిన రోడ్లు, భవనాల సమస్యలను ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.